

17న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పి సిఇఒ కె.సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగే సమావేశంలో జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు సమీక్షిస్తారని పేర్కొన్నారు.

తెలుగువారి ఆత్మ గౌరవం ఢిల్లీలో తాకట్టు

వైసిపి, టిడిపి, జనసేన విధానాలపై గళమెత్తిన ప్రజారక్షణ బేరి

రాష్ట్రానికి బిజెపి తీవ్ర అన్యాయం

నరసాపురం సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం


నరసాపురం సభలో అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం/యలమంచిలి/నరసాపురం

తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని వైసిపి, టిడిపి, జనసేన ఢిల్లీలో తాకట్టు పెట్టడం సిగ్గుచేటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం విమర్శించారు. సిపిఎం చేపట్టిన 'ప్రజారక్షణ భేరి' బస్సు యాత్ర మంగళవారం సాయంత్రం అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి చించినాడ బ్రిడ్జి మీదుగా పశ్చిమగోదావరి జిల్లాలోకి ప్రవేశించింది. చించినాడ, నరసాపురంలో సభలు నిర్వహించారు. నరసాపురంలో సభకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ప్రాంతాలు, రాష్ట్రాల మధ్య వ్యత్యాసం పెరుగుతుందని, ఈ నేపథ్యంలో అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రజా ప్రణాళిక రూపొందించిందన్నారు. విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టు నిధులు, వెనుకపడిన ప్రాంతాల అభివద్ధి, రాజధాని నిర్మాణం నిధులు కేటాయించలేదన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బిజెపి పాలనలో ధరలు పెరిగాయని , ఉద్యోగావకాశాలు లేవని, ఆత్మహత్యలు పెరిగాయని , గిట్టుబాటు ధర అందట్లేదని అన్నారు. రాష్ట్ర హక్కులను హరిస్తున్నా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడకపోవడం దారుణమన్నారు. బటన్ నొక్కడం తప్ప అభివద్ధికి చర్యలు తీసుకోకుండా జగన్ ఓట్ల రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. నరసాపురం ఎంపీ ఈ నియోజకవర్గ సమస్యలను పార్లమెంట్లో ఒక్కరోజూ ప్రస్తావించలేదని విమర్శించారు. విభజన హామీలు అమలు చేసినప్పుడే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి చెప్పారు. రాష్ట్రంలో మూడున్నర లక్షల స్కీం వర్కర్లుగా పనిచేస్తున్నారని, వీరికి కనీస వేతనం లేదన్నారు. నర్సాపురంలో అన్ని వనరులు అందుబాటులో ఉన్నాయని, అభివద్ధి మాత్రం శూన్యమని సిపిఎం రాష్ట్ర నాయకులు వై.రాము విమర్శించారు. వశిష్ట వారధి ఎన్నికల హామీగానే వస్తుందే తప్ప నిర్మాణం మాత్రం చేయలేదన్నారు. ఫిషింగ్ హార్బర్ లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం నిరంతరం పోరాడుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం చెప్పారు. రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవిష్యత్తులో రైతుల పక్షాన నిరంతర పోరాడతామన్నారు. కూలీలకు కనీస వేతనం అందట్లేదని, వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో వేల మంది మత్స్యకార కుటుంబాలు ఉన్నాయని, అయితే వేట నిషేధ సమయంలో కొంతమందికి మాత్రమే పరిహారం అందిస్తున్నారన్నారు. ఉద్యోగులు ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్ హామీని అమలు చేయకుండా విస్మరించారని విమర్శించారు. జిల్లాను కాలుష్యం పట్టిపీడిస్తుందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా విజయవాడలో ఈ నెల 15న నిర్వహించబోయే బహిరంగ సభకు రావాలని కోరారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, రాష్ట్ర నేత కొల్లాటి శ్రీనివాస్, నేతలు దిగుపాటి రాజగోపాల్, ఎం.త్రిమూర్తులు, పొన్నాడ రాము, జల్లి రామ్మోహన్, యడ్ల చిట్టిబాబు, పొగాకు పూర్ణ, నారాయణరావు, తెలగంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

బిజెపి అత్యంత ప్రమాదకారి

ఓడించడమే సిపిఎం లక్ష్యం

సీనియర్ నేత, మాజీ ఎంపీ పి.మధు

ప్రజాశక్తి - యలమంచిలి

బిజెపి అత్యంత ప్రమాదకర విధానాలు అవలంబిస్తోందని, దాన్ని ఓడించడమే సిపిఎం ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ పి.మధు అన్నారు. మంగళవారం బస్సు యాత్రకు చించినాడ గ్రామంలో ఘన స్వాగతం లభించింది. అక్కడి నుంచి స్థానిక అమరవీరుల స్తూపం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్తూపంపై జెండాను మధు ఆవిష్కరించగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, మంతెన సీతారాం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, కె.ధనలక్ష్మి, ఎ.మాల్యాద్రి రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి బి.బలరాం, కోనసీమ జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మండల కార్యదర్శి కె.బాలరాజు అధ్యక్షత వహించగా మధు మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పటేల్ విగ్రహం, అయోధ్యలో రామమందిరం నిర్మించడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి, ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, జనసేన కూడా బిజెపికి అత్యంత సన్నిహితంగా ఉంటున్నాయని, బిజెపితో ఎవరు చెలిమి చేసినా వారికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం చించినాడ పోరాటంలో పాల్గొన్న సీనియర్ నాయకులు కేతా సూర్యారావు, తెన్నేటి సంపతరావు, పెచ్చెట్టి సత్యనారాయణమ్మ, బొల్లా నరసింహామూర్తిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి జార్జి, దేవ సుధాకర్, మాసవరపు సుబ్బారావు, సరిపల్లి జయప్రభ, జిల్లెల్ల ప్రశాంతి, యడ్ల మోహనరావు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, చెల్లిబోయిన వడ్డీకాసులు, ముమ్మిడివరపు ఆంజనేయులు పాల్గొన్నారు.


చించినాడ అమరవీరుల స్తూపంపై జెండాను ఆవిష్కరించి నినదిస్తున్న మధు, నేతలు


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు, రైతులు

రైతులకు వెన్నుదన్ను రైతుభరోసా

జిల్లా కలెక్టర్ ప్రశాంతి - రెండో విడత సాయం జమ

ప్రజాశక్తి - భీమవరం

కౌలు, సన్న, చిన్న కారుల రైతులకు వెన్నుదన్నుగా వైఎస్ఆర్ రైతు భరోసా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. వరుసగా ఐదో ఏడాది, రెండో విడతగా జిల్లాలో 1,26,960 మంది రైతులకు రూ.50.784 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రైతు భరోసాను శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కొట్టి కుటుంబరావు, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా పశుసంవర్ధక వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు, రైతులు ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ కౌలు రైతులు పెట్టుబడి సాయాన్ని వినియోగించుకుని ఆర్థిక లబ్ధి పొందాలన్నారు. జిల్లా కోస్తా తీరంలో ఉండడం, గోదావరి నది డెల్టా ప్రాంతం కావడం కారణంగా తరచూ తుపాన్లు, వరదలు సంభవించి రైతులు పంట నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ఏ పంటకాలంలో దెబ్బతిన్న పంటలకు ఆ పంట కాలం ముగిసే లోపల పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో రూ.50.784 కోట్లు లబ్ధి

ఆచంట నియోజకవర్గంలో 27,263 మంది రైతులకు రూ.10.905 కోట్లు, భీమవరంలో 10,807 మంది రైతులకు రూ.4.323 కోట్లు, నరసాపురం నియోజకవర్గంలో 13,319 మంది రైతులకు రూ.5.328 కోట్లు, పాలకొల్లులో 12,757 మంది రైతులకు రూ.5.103 కోట్లు, తాడేపల్లిగూడెంలో 21,812 మంది రైతులకు రూ.8.725 కోట్లు, తణుకులో 20,215 మంది రైతులకు రూ.8.086 కోట్లు, ఉండిలో 14,339 మంది రైతులు రూ.5.736 కోట్లు, గణపవరంలో 6448 మంది రైతులకు రూ.2.579 కోట్లు మొత్తం రూ.50.784 కోట్లు రైతులకు లబ్ధి చేకూరిందని తెలిపారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ, ఇన్‌ఛార్జి సహకార శాఖ అధికారి కెసిహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా హార్టీకల్చర్ అధికారి ఎ.దుర్గేష్ పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఈ నెల 14వ తేదీ నుంచి కార్తీకమాసం ప్రారంభం కానుండడంతో పేరుపాలెంబీచ్ వద్ద పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. బీచ్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వీసి హాల్లో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ముదునూరి ప్రసాదరాజు సమీక్షించారు. ఈ సమావేశానికి ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు పాల్గొని మాట్లాడారు. ఈ నెల 14వ తేదీ నుంచి డిసెంబరు 12వ తేదీ వరకూ కార్తీకమాసం కావడంతో మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌కు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తారన్నారు. జిల్లా నుంచే కాకుండా వేరే జిల్లాల నుంచి కూడా వచ్చే పర్యాటకులతో బీచ్ కిక్కిరిసిపోతుందన్నారు. పర్యాటకులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో పేరుపాలెంబీచ్ వద్ద సముద్రంలో స్నానాలకు దిగి గల్లంతైన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ఏటా కార్తీక మాసంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పోలీస్ శాఖ ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్‌లో ప్రమాద స్థలాలను గుర్తించి నిఘా పెట్టాలన్నారు. పర్యాటకులు సముద్రం లోపలికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని ఆర్‌డిఒకు సూచించారు. పర్యాటకుల సౌకర్యార్థం ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు నడపాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు అప్రమత్తంగా ఉండి, పర్యాటకులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే బీచ్‌లో స్నానాలకు అనుమతిస్తామన్నారు. బీచ్ వద్ద ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం తాగి అల్లర్లు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు జెడ్‌పిటిసి తిరుమల బాబ్జి నరసాపురం తహశీల్దార్ సయ్యద్ మౌలాల పాజిల్, మొగల్తూరు తహశీల్దార్ జి.అనితకుమారి, జి.శ్రీనివాస్ యాదవ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతుకు కష్టం..!

- పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు
- నేల వాలుతున్న వరిచేలు
- వెంటాడుతున్న ఎండాకు తెగులు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- దిక్కుతోచని స్థితిలో జిల్లా రైతాంగం


కోతకు సిద్ధంగా ఉన్న వరిచేను


తెలుగు సోకిన వరిచేను

ప్రజాశక్తి - భీమవరం

ఇప్పటివరకూ సాగులో అనేక ఇబ్బందులు అధిగమించిన రైతాంగానికి అకాల వర్షం కష్టాన్ని మిగిల్చింది. వాతావరణ మార్పులతో రైతులకు కంటిమీద కునుకు కరువైంది. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి చేలు వెన్ను వాలుస్తున్న పరిస్థితి. మొన్నటి వరకూ సాగునీటి ఎద్దడితో సతమతమైన రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో దిగాలు చెందుతున్నారు. వర్ష ప్రభావం దిగుబడులపై ఎంత ప్రభావం చూపుతుందో అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరుగాలం శ్రమించే రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. సాగు ప్రారంభం నుంచి పూర్తయ్యేంత వరకూ ఏదో ఒక రూపంలో కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతులు సాగు చేసేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొన్నటి వరకూ సాగునీటి ఎద్దడితో రైతులు సతమతమయ్యారు. శివారు పొలాలకు సాగునీరు అందకపోవడంతో పొలాలు బీటలు వారాయి. దీంతో రైతులు ఆయిల్ ఇంజిన్ ఏర్పాటు చేసుకుని నీటిని తోడుకున్న పరిస్థితి ఉంది. దీనికి అదనంగా రూ.5 వేలు నుంచి రూ.8 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. సాగులో ఎన్నో కష్టాలు ఓర్చిన రైతులకు రెండు రోజులుగా కురుస్తున్న వార్షాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పాలకోడేరు, భీమవరం, వీరవాసరం, ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకొల్లు, పెనుమంట్ర ప్రాంతాల్లో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలకు రైతులు దిగాలు చెందుతున్నారు. వర్షానికి వరిచేలు నేలకొరిగాయి. ఇదే పరిస్థితి కొనసాగితే సార్వా పంటను గట్టుకు చేర్చడానికి తీవ్ర ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం వరిచేలు ఆశాజనకంగా ఉన్నాయి. దిగుబడులు కూడా ఆశించిన మేర కనిపిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఎకరానికి 35 నుంచి 38 బస్తాల వరకూ దిగుబడి వస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు.

కీలక దశలో వరిచేలు

జిల్లాలో 20 మండలాల్లో రైతులు 2 లక్షల 10 వేల 650 ఎకరాల్లో సార్వసాగు చేపట్టారు. సీజన్ ప్రారంభంలోనే వర్షాలు సరిగ్గా లేకపోవడంతో జిల్లా అంతటా వరినాట్లు వేయడంలో ఆలస్యమైంది. ఈ కారణంగా ప్రస్తుతం భీమవరం, పాలకోడేరు, వీరవాసరం, ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకొల్లు, నరసాపురం, ఆచంట, పెనుమంట్ర, అత్తిలి వంటి మండలాల్లో వరిచేలు గింజ గట్టిపడే దశ, కోత దశలో ఉన్నాయి. అక్కడక్కడా బాగా ఆలస్యంగా నాట్లు వేసిన ప్రాంతాల్లో వరి చేలు ప్రస్తుతం ఈనిక దశలో ఉన్నాయి. డెల్టా ప్రాంతంలో మరో 10 రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.25 నుంచి రూ.30 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే కొనసాగితే దిగుబడులపై తీవ్ర ప్రభావం ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే మెట్ట ప్రాంతాలైన తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం తదితర మండలాల్లో వరి మాసూళ్లు ప్రారంభమయ్యాయి. ఇక్కడ సుమారు 10 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. అలాగే విత్తన పంటల కోతలు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం మాసూళ్ల ప్రక్రియ జరుగుతోంది. ముసురు పట్టడంతో ఆరబెట్టేందుకు అవకాశం లేదు. దీనికి తోడు ధాన్యంలో తేమ శాతం ఎక్కువ ఉండడంతో ఎక్కడ ధాన్యాన్ని అక్కడే ఉంచారు. దీంతో రైతులకు కంటి మీద కునుకు ఉండడం లేదు.

వెంటాడుతున్న ఎండాకు తెగులు..

ఏడాది సార్వా వరి చేలను ఎండాకు తెగులు ఎక్కువగా చుట్టుముట్టింది. ఈ తెగులు ముఖ్యంగా ఎంటియు 1318, సంపద, జైశ్రీరామ్ వంటి రకాలను ఎక్కువగా ఆశించింది. దీని నివారణకు రైతులు అధిక మొత్తంలో తెగుళ్ల మందు కోసం ఖర్చు చేయాల్సి వచ్చింది. ముందస్తు వరినాట్లు వేసిన ప్రాంతాల్లో ఎండాకు తెగులు ఎక్కువగా ఉంది. యూరియా (నత్రజని)ని ఎక్కువగా వేసిన వరి చేలల్లో కూడా ఈ తెగులు ఆశించినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. కొన్ని ప్రాంతాల్లో ఆకు ముడత తెగులు ఎక్కువగా ఆశించింది. ఇప్పటికే ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకూ ఖర్చుపెట్టిన రైతులకు ప్రస్తుత వాతావరణ మార్పు దడ పుట్టిస్తోంది. మునుముందు ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

జగనన్న పాలనలో అన్నదాతకు అగ్రపీఠం

మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారంలో డిప్యూటీ సిఎం కొట్టు


సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం :ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో అన్నదాతకు అగ్ర పీఠం వేశారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో జరిగిన సభలో నూతన పాలకవర్గం చేత మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. ఛైర్మన్‌గా ముప్పిడి సంపత్ కుమార్, వైస్ ఛైర్మన్‌గా చోడగిరి సత్యనారాయణ (చినబాబు), డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ నాడు వ్యవసాయం దండగన్న చంద్రబాబుకు నేడు వ్యవసాయ రంగం గురించి, రైతు గురించి మాట్లాడే కనీస అర్హత లేదని విమర్శించారు. రాజశేఖర్ రెడ్డి వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ ఇస్తానంటే చంద్రబాబు కరెంటు తీగల మీద బట్టలు ఆరేసుకోవాలని అపహాస్యం చేశారని గుర్తు చేశారు. నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తూ ఇంతవరకు రెండు లక్షల నలభై వేల కోట్ల రూపాయల మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ చేశారని తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోనే 67,312 మంది రైతులకు 210 కోట్ల 50 లక్షల రూపాయలు ఇచ్చి అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుందన్నారు. పవన్ కళ్యాణ్‌కు రైతుల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. యూత్ లీడర్ కొట్టు విశాల్, సిజిఎఫ్ కమిటీ మెంబర్ కర్రి భాస్కరరావు, వన్ టౌన్ సచివాలయాల కన్వీనర్ కొలుకులూరి ధర్మరాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కైగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రి నిర్మాణం వేగవంతం

ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం వేగవంతంగా జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఆసుపత్రి నిర్మాణానికి నాలుగెకరాల భూమి అవసరం కావడంతో తమ కుటుంబం ఆ నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేసి నిర్మాణానికి ఇచ్చినట్లు తెలిపారు. మొదటి విడతగా మంజూరైన రూ.10.15 కోట్లతో ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతుండగా రెండో విడత ప్రభుత్వం నాబార్డు నిధులు రూ. 28 కోట్లు మంజూరు చేసిందన్నారు. భీమవరానికి సుమారు 14 కిలోమీటర్ల దూరంలో మెడికల్ కాలేజీ ఏర్పాటవుతున్న నేపథ్యంలో అధికారులు భీమవరంలో జరిగే వంద పడకల ఆసుపత్రికి అడ్డు తగిలినప్పటికీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన అభ్యర్థనను మన్నించి రెండో విడతగా రూ.28 కోట్ల నిధులను మంజూరు చేశారని, ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని తెలిపారు.


ఎంఎల్‌ఎను సత్కరిస్తున్న జర్నలిస్టులు

తల్లీబిడ్డల ఆసుపత్రిగా మారనున్న ప్రస్తుత ఆసుపత్రి

వంద పడకల ఆసుపత్రి ప్రజా వినియోగంలోకి వచ్చిన వెంటనే ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాసుపత్రిని తల్లీబిడ్డల ఆసుపత్రిగా మార్పు చేయడం జరుగుతుందని ఎంఎల్ఎ గ్రంధి వివరించారు.

ముఖ్యమంత్రికి జర్నలిస్టుల సమస్యలు తెలుసు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలు పూర్తిగా తెలుసుని ఎంఎల్ఎ శ్రీనివాస్ తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి గాను ఇటీవల ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో భీమవరం జర్నలిస్టులు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు జరుగుతుందన్నారు.

న్యూస్ క్లిక్ సిబ్బందిపై కేసులు ఉపసంహరించుకోవాలి


కాపీలను దహనం చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

న్యూస్ క్లిక్ సిబ్బందిపై కేంద్ర ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలి సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘాల సమన్వయ కమిటీ, కార్మిక సంఘాల పిలుపుమేరకు వెంప గ్రామంలో సిఐటియు, వ్యకాస ఆధ్వర్యంలో న్యూస్ క్లిక్ సిబ్బందిపై పెట్టిన అక్రమ కేసులు రద్దు చేయాలని వెంప బస్టాండ్ సెంటర్లో జిఒ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ బావ ప్రకటనా స్వేచ్ఛను హరించే విధంగా న్యూస్ క్లిక్ పత్రిక విలేకరిపై అక్రమంగా కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. న్యూస్ క్లిక్ పత్రిక విలేకరిపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న కాలనీల గృహ నిర్మాణాలు మరింత వేగవంతం చేసి ప్రగతి చూపాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్‌లో జిల్లాలో వివిధ లే అవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలపై గృహ నిర్మాణ సంస్థ అధికారులతో జిల్లా కలెక్టరు సమీక్షించారు. జిల్లాలో మండలాల వారీగా ఇళ్ల నిర్మాణ ప్రగతి జిల్లా కలెక్టరు సమీక్షిస్తూ వెనుకబడిన మండలాలు అధికారులపై జిల్లా కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. చిన్న చిన్న లే అవుట్లలో ప్రగతి చూపకపోవడంతో జిల్లా కలెక్టరు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ పీడీ ఆర్‌సి ఆనంద్ కుమార్, ఇఇ బి.వెంకటరమణ, డిఇలు జి.పిచ్చయ్య, పి.శివరామరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి - పోడూరు

బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సిపిఎం జిల్లా నాయకులు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజ్‌గోపాల్ అన్నారు. మండలంలోని పోడూరు గ్రామంలో ఉన్న రామాలయంలో మంగళవారం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్‌గోపాల్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చాక ప్రజలకు ఏం చేసిందో చెప్పాలన్నారు.ప్రభుత్వ సంస్థలను ప్రయివేట్ పరం చేయడం తప్ప ప్రజలకు మేలు జరిగిందేమీ లేదన్నారు. జిల్లా కారవర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బురాబత్తుల వెంకటరావు, గూటం జ్యోషి క్రాంతి కుమార్, బండి సత్యనారాయణ పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు పట్టాలి

ప్రజాశక్తి - గణపవరం

బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోష్‌నాయుడు అన్నారు. ఆసుపత్రిలో డాక్టర్ కిరణ్మయి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.అనంతరం ఆశావర్కర్లకు సంతోష్‌నాయుడు దుప్పట్లు అందించారు.

వేదిక ఏర్పాటుతో ట్రాఫిక్ ఇబ్బందులు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల ఎనిమిదో తేదీ బుధవారం మధ్యాహ్నం పాలకొల్లు పట్టణంలో వైసిపి సారధ్యంలో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పాలకొల్లు మెయిన్ రోడ్డులో ఏనుగులు మేడ వద్ద భారీ స్టేజీ ఏర్పాటు చేపట్టారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఎనిమిదో తేదీ రాత్రి వరకు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పవని ప్రజలు, వ్యాపారులు చెబుతున్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సిఎం జగన్‌కు రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలు పూర్తిగా తెలుసని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ఇటీవల సిఎం జగన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో భీమవరం జర్నలిస్టులు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు.

జీవ కణాలపై విస్తృత పరిశోధనలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జీవ కణాలపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని ఎస్ఎన్.బోస్ నేషనల్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్సెస్ శాస్త్రవేత్త డాక్టర్ ఆయాత్తి మల్లిక్ గుప్తా తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎపి నిట్)లోని బయో టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఇన్ సిలికో మాక్రో మోలక్యులర్ మోడలింగ్, వర్చువల్ స్క్రీనింగ్ అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాపు మంగళవారం సాయంత్రం ముగిసింది. ఈ కార్యక్రమానికి బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ సుదర్శన దీప అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి మల్లిక్ గుప్తా మాట్లాడారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ రాజేశ్వరరెడ్డి, ఏర్వ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ జగన్‌మోహనరావు, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణం

భీమవరం రూరల్ : విస్సాకోడేరు జగనన్న లేఅవుట్ కాలనీలో వేగవంతంగా గృహ నిర్మాణాలు జరుగుతున్నాయని, 3,800 మంది లబ్ధిదారులకు ఇప్పటికే రెండు వేల గృహాలు నిర్మాణంలో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. విస్సాకోడేరు జగనన్న లేఅవుట్ కాలనీలో లబ్ధిదారుల కోరిక మేరకు గృహ నిర్మాణాలు చేపట్టిన తారకరామ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లబ్ధిదారులకు ఉచిత రవాణా సదుపాయాన్ని ఏర్పాటు చేస్తూ వాహనాన్ని సిద్ధం చేసింది. ఈ వాహనాన్ని మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపిల జిల్లా సంఘం అధ్యక్షులు పేరిచర్ల విజయనరసింహరాజు, కోమటి రాంబాబు, మానుకొండ ప్రదీప్, గూడూరి ఓంకార్, పళ్ల ఏసుబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

అధికంగా మీడియా రంగం వార్షిక వృద్ధిరేటు

తణుకు రూరల్: మీడియా రంగం వార్షిక వృద్ధిరేటు అధికంగా ఉందని, రానున్న పదేళ్లలో ఈ రంగం మరింత వృద్ధిరేటు కనపరుస్తుందని, మీడియాలో మహిళలకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని సీనియర్ పాత్రికేయులు, ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కార్యదర్శి సభ్యులు డి సోమసుందర్ అన్నారు. స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి మంగళవారం జర్నలిజం డిప్లమో కోర్సు ప్రారంభోత్సవం కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జర్నలిజం డిప్లమో కోర్సుకు ఫ్యాకల్టీగా పనిచేస్తున్న డి.రామకృష్ణ, పి.గంగాధర్, జి.నాగరాజా, కోర్సు సమన్వయకర్త ఎస్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

బోగేంద్రబాబు సేవలు అభినందనీయం

సీసలి గ్రామస్తుల ప్రశంసలు

ప్రజాశక్తి - కాళ్ల

సొంత ఊరు కన్నతల్లి అన్నారు పెద్దలు. జన్మనిచ్చిన తల్లిని, పుట్టి పెరిగిన ఊరును ఎవరూ మర్చిపోలేరు. సీసలి గ్రామానికి చెందిన నూకల బోగేంద్రబాబు గత రెండేళ్లుగా సీసలి గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా సేవలందిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. జనసేన పార్టీ సీసలి గ్రామ అధ్యక్షులుగా ఉంటూ సొంతఊరిపై మమకారంతోపలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ఉన్నత స్థితికి చేరారు. వ్యాపారంలో సంపాదించిన దాంట్లో కొంత భాగంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నారు. తనవంతు సహకారం అందిస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పడుతున్నారు.



పేదలకు నిత్యావసరాలు అందిస్తున్న బోగేంద్రబాబు

మంచినీటి ట్యాంకర్ ఏర్పాటు

మండలంలోని సీసలిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా మంచినీటి కోసం ఇబ్బందులు పడేవారు. వివాహాలు, ఇతర కార్యక్రమాలు అన్న సమారాధన నిర్వహించడానికి మంచినీటి ట్యాంకర్‌ను రూ.2.50 లక్షలతో కొనుగోలు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచారు.

ప్రతి వారం పది కుటుంబాలకు నిత్యావసర సరుకులు

జనసేన పార్టీ సీసలి గ్రామ అధ్యక్షులు నూకల బోగేంద్రబాబు, కొటికలపూడి శివకృష్ణ, గణేశ్న మణి, కొమ్మన రాము, మద్దాల గణికుమార్, పలువురి ఆర్థిక సాయంతో పది నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ప్రతి వారం పది కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

ప్రజా సేవ చేయడం ఆనందం

నూకల బోగేంద్రబాబు



పవన్‌కల్యాణ్ ఆశయాల మేరకు జనసేన పార్టీలో గ్రామ పార్టీ అధ్యక్షులుగా పనిచేస్తున్నాను. గ్రామ ప్రజలకు నా వంతు ఆర్థిక సాయం అందిస్తున్నాను. కొంతమంది జనసేన పార్టీ నాయకుల ఆర్థిక సాయంతో ప్రతి వారం పది కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తున్నాం. ప్రతి కార్యక్రమానికి తాగునీటిని వాటర్ ట్యాంకర్ ద్వారా అందిస్తున్నాం. ఇప్పటివరకు 12 వారాల నుంచి నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించాం. జనసేన పార్టీ ఆశయాలకు అనుగుణంగా పేద ప్రజలకు నిత్యం నా వంతు సాయం చేస్తాను.

విధి నిర్వహణలో ఉన్న వారిపై దౌర్జన్యాలు తగవు

జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

విధినిర్వహణలో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తున్న మోటారు అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ ఎం.రవికుమార్, ఎన్.లక్ష్మిపై దౌర్జన్యాలు చేస్తే విధులు ఎలా నిర్వహించగలరని జిల్లా రవాణా శాఖ అధికారి ఉమహేశ్వరరావు అన్నారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 3న వీరవాసరంలో వాహనాల తనిఖీల కోసం వెళ్తూ పాలకోడేరు మండలం పెన్నాడ వద్ద ఒక వాహనాన్ని నిలుపుదల చేసే క్రమంలో ఆ వాహనదారుడు ఆ వెహికల్‌ను అక్కడ ఉన్న షాపుల మధ్యకు తీసుకువెళ్లారన్నారు. అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ రవికుమార్, లక్ష్మి తమ వద్ద ఉన్న హోంగార్డును పంపించి వెహికల్‌ను చూసి రావాలని చెప్పగా అతను వెళ్లి వాహనాన్ని చూసి తిరిగి వస్తుండగా అక్కడే ఉన్న కును కు రామకృష్ణ ఆవేశంగా వీడియోలు తీస్తూ ఇన్‌స్పెక్టర్లపైకి దూసుకు వచ్చి అక్కడ ఉన్న కొందరి దగ్గర నుంచి రూ.3వేలు లంచం తీసుకున్నారని వీడియోలు రికార్డు చేస్తూ గతంలో తన వాహనానికి రాసిన ఫైన్‌ను గురించి ఆగ్రహం వ్యక్తం చేస్తూ వీడియోలు రికార్డ్ చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేసే విధంగా ప్రవర్తించారన్నారు. విధులకు ఆటంకం కలిగించి భయభ్రాంతులకు గురి చేసిన రామకృష్ణపై ఇన్‌స్పెక్టర్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదైందన్నారు. గతంలో ఇతను ఒక టోల్ ప్లాజా వద్ద కారు ఆపినందుకు అక్కడి సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి దిగి రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేని టోల్‌ప్లాజ్ గురించి రాష్ట్ర ప్రభుత్వాన్ని బూతుల తిడుతూ సోషల్ మీడియాలో పెట్టారన్నారు. సోషల్ మీడియాలో ఫేమస్ కావడం కోసం విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల పట్ల రామకృష్ణ దురుసు ప్రవర్తనను ఖండిస్తున్నామన్నారు. ఎఎంవి రవికుమార్ మాట్లాడుతూ మద్యం తాగి ఉన్న కునుకు రామకృష్ణ తీవ్ర ఆవేశంతో వీడియోలు రికార్డు చేసుకుంటూ తమ వాహనం దగ్గరకు వచ్చి 'గతంలో నా బండికి వేల రూపాయలు ఫైన్ వేశావు, ఇప్పుడు ఆగి ఉన్న వాహనాన్ని కూడా తనిఖీ చేస్తున్నావు' అంటూ అక్కడే ఉన్న అతని మనుషులతో రూ.3 వేలు లంచం తీసుకున్నామని చెప్పించి వీడియోలు రికార్డు చేసి భయభ్రాంతులకు గురి చేశాడన్నారు. గతంలో కాకినాడలో ఒక వెహికల్ ఇన్‌స్పెక్టర్‌ను ఒక వ్యక్తి నరికిన సంఘటన గుర్తొచ్చి తాము కారులోంచి మాట్లాడి అక్కడి నుంచి వెళ్లిపోయామని చెప్పారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి మాట్లాడుతూ రామకృష్ణ దురుసుగా వచ్చి వీడియోలు రికార్డు చేస్తూ ఉండడంతో భయాందోళన కలిగి కారులోనే ఉండిపోయానన్నారు. ఈ సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు డి.వి.రమణ, కెవిఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజా రక్షణ భేరి జయప్రదానికి పిలుపు

పెంటపాడు: సిపిఎం ప్రజా రక్షణ భేరి యాత్రను జయప్రదం చేయాలని పెంటపాడు మండల కమిటీ కోరింది. పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో ముఖ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి ఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రంగారావు మాట్లాడుతూ ఈ నెల ఎనిమిదో తేదీన పత్తిపాడు బైపాస్ రోడ్డు నుంచి బైక్ ర్యాలీగా తాడేపల్లిగూడెం ఎస్‌కె గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పెనగంటి దుర పాల్గొన్నారు.

తణుకు రూరల్ : తణుకులో జరుగుతున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వి.ప్రతాప్ కోరారు. ప్రధాన కూడళ్లలో మంగళవారం ప్రచారం, అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఎనిమిదో తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రజా రక్షణ భేరి సభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గోవింద్, గార రంగారావు, ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, గోపి, ఎం సువర్ణరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు. వేల్పూరు గ్రామంలో సాలిపేటలో ప్రజా ప్రణాళిక కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాడిశెట్టి రామాంజనేయులు, తిప్పా వెంకటేశ్వరరావు, నక్కా వెంకన్న, రమణ కాంతారావు పాల్గొన్నారు. 15న విజయవాడలో నిర్వహించనున్న ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు ఐలు న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో ఐలు ఆధ్వర్యంలో ప్రజారక్షణ భేరి కరపత్రాలను పంపిణీ చేశారు. ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, పౌర హక్కుల సంఘం నాయకులు కవురు వెంకటేశ్వర్లు, సోమేశ్వరరావు, విక్టర్‌బాబు, డి.అప్పారావు, ఎస్‌కె.బాజీ పురుషోత్తం పాల్గొన్నారు.

రబీలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళిక సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

రానున్న రబీ పంట సాగులో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రబీ సాగుకు నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె స్పష్టం చేశారు. ధవళేశ్వరం నుంచి వంతుల వారి విధానంలో సాగునీరు అందించడం జరుగుతుందని, భవిష్యత్ సాగునీటి అవసరాలు దృష్ట్యా వరి సాగుకు బదులుగా ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డిఇ సుబ్రహ్మణ్యేశ్వరరావు, దక్షిణామూర్తి, ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు, వ్యవసాయ శాఖ ఎడిలు పాల్గొన్నారు.

ఇవిఎం గోడౌన్ పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఇవిఎంలు, వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరం సిడబ్ల్యూసి గోడౌన్‌లో ఏర్పాటుచేసిన ఇవిఎం గోడౌన్‌ను మంగళవారం కలెక్టర్ ప్రశాంతి, జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం గడువులోపు సజావుగా ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. చెకింగ్‌లో గుర్తించి పనిచేయని ఇవిఎంలను బెంగళూరుకు పంపించాలన్నారు. పోలీస్ చెక్‌పాయింట్, రిజిస్టర్, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ సమావేశంలో ఫస్ట్ లెవెల్ చెకింగ్ సూపర్‌వైజర్, జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, డిఎల్‌డిఒ, ఇన్‌ఛార్జి జిల్లా సహకార శాఖాధికారి కెసిహెచ్.అప్పారావు, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ లక్కు నరసింహరావు పాల్గొన్నారు.

డ్రెయిన్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ధర్నా

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లిలో జాతీయ రహదారి పక్కన నిర్మిస్తున్న డ్రెయిన్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. డ్రెయిన్లను అసంపూర్తిగా నిర్మించడంతో మురుగునీరు బయటకు వెళ్లకుండా అక్కడే ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. వాటిలో దోమలు విపరీతంగా పెరిగి డెంగీ, మలేరియా వంటి జ్వరాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులు స్పందించి అసంపూర్తి డ్రెయిన్‌లను పూర్తిస్థాయిలో నిర్మించాలని రాంబాబు, కొల్లాటి ములాస్వామి కోరుతున్నారు.

పది విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కోచింగ్

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో మార్టేరులోని విద్యార్థి స్కూల్‌లో, శ్రీ వేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం కెరీర్ గైడెన్స్ కోచింగ్ నిర్వహించారు. మానవత కెరీర్ గైడెన్స్ జిల్లా కమిటీ ఛైర్మన్ కోడూరి రాధా పుష్పవతి మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా మెలకువలు నేర్పించారు. తొమ్మిదో తరగతిలో గతేడాది ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న విద్యార్థులు తొమ్మిది మందికి మెడల్స్, సర్టిఫికెట్స్, మెమెంటో ఇచ్చి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, మానవత మండల ఛైర్మన్ చిర్ల సూర్యనారాయణరెడ్డి, పూర్వ అధ్యక్షులు కడలి సుబ్రహ్మణ్యం, మానవతా ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి, విద్యార్థి స్కూల్ కరస్పాండెంట్ పడాల వెంకటరెడ్డి, వేణుగోపాల జిల్లా పరిషత్ హెడ్‌మాస్టర్ చిర్ల చిన్నసూర్యనారాయణరెడ్డి, మానవత వైస్ ప్రెసిడెంట్ కర్రి కృష్ణారెడ్డి, మానవత సభ్యురాలు కె.పద్మావతి, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

భీమవరం : కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీ నుంచి పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్‌టిసి భీమవరం డిపో మేనేజర్ పిఎన్‌విఎం.సత్యనారాయణమూర్తి తెలిపారు. స్థానిక డిపో వద్ద ఆయన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 19, 26, వచ్చే నెల 3, 10వ తేదీల్లో భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల నుంచి ప్రత్యేక బస్సులు రాత్రి తొమ్మిది గంటలకు బయలుదేరుతాయని చెప్పారు. భీమవరం డిపో నుంచి 30 బస్సు సర్వీసులను కార్తీక మాసం నేపథ్యంలో నడపనున్నట్లు తెలిపారు. టికెట్ ధరలు పల్లె వెలుగు రూ.700, ఎక్స్‌ప్రెస్ రూ.900, అల్ట్రా డీలక్స్ రూ.1,000, సూపర్ లగ్జరీ రూ.1,100గా నిర్ణయించామని తెలిపారు. ఇతర విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ పంచారామలకు ఒక గ్రామం నుంచి 40 మంది ఉంటే ఆ గ్రామం నుంచే బస్సు సౌకర్యం ఉంటుందని తెలిపారు. శబరిమలైకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, స్వాములకు కావాల్సిన విధంగా బస్సులను సిద్ధం చేస్తామని తెలిపారు. ఇప్పటికే రెండు ప్యాకేజీలు సిద్ధంగా ఉన్నాయని వాటిలో ఒకటి ఆరు రోజులు, మరొకటి ఎనిమిది రోజుల యాత్ర ప్యాకేజీలని చెప్పారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

తణుకు : ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ 35వ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా స్థానిక మాంటిస్సోరి విద్యార్థులు అత్యధిక ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. సబ్ జూనియర్స్ హాకీ బాలుర విభాగంలో తొమ్మిదో తరగతికి చెందిన ఎల్.జోషిత అమర్నాథ్, ఎనిమిదో తరగతి విద్యార్థి పి.వశీకర్, ఏడో తరగతి విద్యార్థి ఎం.నాగధర్, ఎం.సాయి గోవర్ధన్‌రావు, జి.వేణుగోపాల్, జి.జస్వంత్, జి.సూర్యసిద్ధార్థ్ వెండి పతకాలు సాధించినట్లు వివరించారు. క్రెడిట్ హాకీ బాలుర విభాగంలో ఆరో తరగతి విద్యార్థులు ఎం.నాగసాయి కేశవ్, టిఎస్‌ఆర్‌బి.సాకేత్, వివిఎస్.అనురాగ్, ఐదో తరగతి విదార్థులు ఎన్‌కెఎస్‌కె.హర్షత్, ఎస్.చేతన్‌నాగవిహార్, జె.కార్తికేయకుమార్, కె.నిత్యన్‌గౌడ్, సిహెచ్ జో శ్రీ వెంకట సాయి కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. ఇన్‌లైన్ హాకీ క్రెడిట్ బాలికల విభాగంలో మూడో తరగతి విద్యార్థి మోహిత్ దాస్ వెండి పతకాన్ని, క్వాడ్ హాకీ జూనియర్ బాలుర విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం.ఓంకార్ బంగారు పతకాన్ని, క్వాడ్ హాకీ జూనియర్ బాలికల విభాగంలో పి.అమూల్య కాంస్య పతకాన్ని, మిక్స్ గ్రూపులో వెండి పతకాన్ని సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కోచ్ అభినందించారు.

ఒక లైసెన్స్‌పై ఎక్కువ బాణసంచా షాపులు నిర్వహించొద్దు

నరసాపురం టౌన్ : ఒక లైసెన్స్‌లో ఎక్కువ బాణసంచా దుకాణాలు నిర్వహించొద్దని ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ అన్నారు. నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో దీపావళి దుకాణదారులకు మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆర్‌డిఒ అంబరీష్ మాట్లాడారు. దీపావళి పండుగ రోజున ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు ఎస్ఎం.ఫాజిల్, అనిత కుమారి, సిఐ శ్రీనివాస్ యాదవ్, మొగల్తూరు ఎస్ఐ వీరబాబు, అగ్నిమాపక శాఖాధికారి భాస్కరరామం, రెవెన్యూ సిబ్బంది సురేఖ, దేవి, నరసింహమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వైఎన్ కళాశాలలో జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం

ప్రజాశక్తి - నరసాపురం రూరల్

స్థానిక శ్రీ వైఎన్.కళాశాలలోని సామాజిక సేవా విభాగం ఆధ్వర్యంలో జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక అశ్వని హాస్పిటల్ డాక్టర్ మాదంశెట్టి కోటేశ్వరరావు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, కళాశాల డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్, సామాజిక సేవ విభాగ సమన్వయకర్త బిఎస్ఎస్‌వి.ప్రసాద్, కామర్స్ అధ్యాపకులు పి.వీరాస్వామి, రాంబాబు, మేరీగ్రేస్, గంగా, పావని, కంప్యూటర్ రవి పాల్గొన్నారు.

ఆకివీడు : దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ తంగి భోగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో కేన్సర్ వ్యాధి నిపుణులు దత్తాత్రేయ మాట్లాడారు.

వరికి తెగుళ్లు.. ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి తెగుళ్ల ఉధృతి పెరిగి రైతులు, కౌలు రైతులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం వరిలో ఆకు ముడత, పాము పొడ తెగులు సోకుతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పొలమూరు నుంచి బ్రాహ్మణచెరువు వెళ్లే రహదారి పక్కన పొలమూరు గ్రామానికి చెందిన జోపాటి ఆంజనేయులు (కౌలు రైతు) నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. ప్రస్తుతం వరిలో ఆకు ముడత, పాము పొడ తెగులు సోకినట్లు కౌలు రైతు తెలిపారు. అడపాదడపా దోమ పోటు ఉందని చెబుతున్నారు. సమస్యలను ఆంజనేయులు ఎఒ జ్యోషిల దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని పెనుమంట్ర, ఆలమూరు, భట్లమాగుటూరు, ఓడూరు, నెలమూరు, కొయ్యేటిపాడు, సత్యవరం, మల్లిపూడితో పాటు పలు గ్రామాల్లో పాము పొడ తెగులు సోకిన వరి పంటకు వాలిడామైసిన్ ఒక లీటర్ చొప్పున రెండు ఎకరాలకు పిచికారీ చేసుకోవాలని ఎఒ సూచించారు. ఆకు ముడతకు ఫ్యూయోడామైసిన్ 1.5 గ్రాముల చొప్పున పిచికారీ చేస్తే తెగుళ్ల ఉధృత కొంతమేర తగ్గుతుందని ఆమె చెప్పారు.

అనారోగ్యంతో పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని దొడ్డనపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి చెలంకూరి వెంకటేశ్వరరావు (52) అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన భీమవరం మండలంలోని తుందుర్రు, లోసరి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ఉండి మండలాల్లోని పలు మేజర్ పంచాయతీలకు కార్యదర్శిగా పనిచేశారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని భీమవరంలోని ఆయన సొంత ఇంటికి తరలించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ వెంకటేశ్వరరావు సోదరుడు చెలంకూరి వీరవెంకట సత్యనారాయణ సంతాపం తెలిపారు. డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, భీమవరం జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేకుల నరసింహరావు, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, పలువురు ప్రముఖులు వెంకటేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

తహశీల్దార్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర తహశీల్దార్ దండు అశోక్‌వర్మ తల్లి అచ్యుతం (83) మంగళవారం ఉదయం మృతి చెందారు. తణుకులో అశోక్‌వర్మ స్వగృహం వద్ద ఆమె మృతి చెందారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

జగనన్న కాలనీలో ఇళ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని హౌసింగ్ డిఇ గోపాలరాజు సూచించారు. మండలంలోని నెలమూరులో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలరాజు మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ మల్లేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వర్క్ ఇన్‌స్పెక్టర్, వాలంటీర్లు పాల్గొన్నారు.

వృద్ధురాలికి తోపుడు బండి అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు 21వ వార్డు లాకోపేట దగ్గర 65 ఏళ్ల వృద్ధురాలికి వ్యాపారం చేసుకోడానికి డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ తోపుడు బండి అందించారు. జొన్న పొత్తుల వ్యాపారం చేసుకునేందుకు తోపుడు బండి అవసరం కావడంతో ఆ వృద్ధురాలు మానుకొండ శ్రీనును కోరింది. ఆయన తాతాజీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన తాతాజీ తోపుడు బండిని తయారు చేయించి వృద్ధురాలికి అందించారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గమ్మ ఆలయ ఛైర్మన్ కావాలి శ్రీను, వెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, మన్యం జగ్గమ్మ సత్రం ఛైర్మన్ నంబూరి గంగపవన్, మాజీ సర్పంచి గంటా నరేష్, చెన్ను విజయ్, పెచ్చెట్టి కృష్ణాజి, ఉనికెల శ్రీను, కొర్రగింజల శ్రీను, బాకూరి సత్య నిరంజన్, రేలంగి శ్రీను, కొర్రగింజల హనుమంతరావు, పిల్లా అప్పాజీ, పాలపర్తి కృపనాథ్, దిద్దే చిట్టిబాబు, చోడదాసి రమేష్ పాల్గొన్నారు.

'టిడిపి విజయానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి - పోడూరు

వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయానికి బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌ఛార్జులు, పార్టీ గ్రామ అధ్యక్షులు కృషి చేయాలని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని జిన్నూరులో పోడూరు క్లస్టర్-1కి సంబంధించిన టిడిపి బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌ఛార్జులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, పార్టీ గ్రామ అధ్యక్షులకు, ముఖ్య నాయకులకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ఎంతో సమయం లేదని, ప్రతి గ్రామంలో ఉన్న బూత్ కన్వీనర్లు భాధ్యత వహించి మినీ మ్యానిఫెస్టోను ఇంటింటికీ తీసుకెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు పెచ్చెట్టి చంద్రమౌళి, మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, దేవెళ్ల ప్రసాద్, దాసరి రత్నరాజు, పాలవలస తులసిరావు, ఏళ్లమెల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి ఒకరోజు శిక్షణ

ఆకివీడు: ప్రతిఒక్కరూ ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలన్నీ స్పష్టంగా తెలియజేయాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ హైమావతి సిబ్బందికి పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పథకాలు ప్రచారంలో భాగంగా చేపట్టిన కార్యక్రమంపై సిబ్బందికి ఒకరోజు శిక్షణ మంగళవారం నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐదు సచివాలయాల సిబ్బంది, అంగన్‌వాడీ విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, ఆశా వర్కర్లు, నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ సిబ్బంది హాజరయ్యారు.